క్లుప్తంగా

ఎమ్మెల్సీని కలిసిన ఆర్యవైశ్య వర్తక సంఘం చైర్మన్



సుబ్బారావును సత్కరిస్తున్న ఎమ్మెల్సీ

పోరుమామిళ్ల : బద్వేలు ఆర్యవైశ్య వర్తక సంఘం చైర్మన్‌గా ఇటీవల ఎన్నికైన కె.సి.సుబ్బారావు శనివారం పోరుమామిళ్ల పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి సత్కరించారు. అనంతరం చైర్మన్‌గా ఎన్నికైన సుబ్బారావును అభినందిస్తూ ఎమ్మెల్సీ ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు భూపాలం నాగరాజారావు, మెంటా శ్రీనివాసులు, గుబ్బా వెంకటేశ్వర్లు, జడల వెంకటయ్య, కొండపల్లి సాయికుమార్, చిత్రాల నాగరాజా పాల్గొన్నారు.

వనభోజనం



వరికుంట్లలో వనభోజనానికి వెళుతున్న మహిళలు

కాశినాయన : మండలంలోని వరికుంట్ల, నాయునిపల్లె, గొంటువారిపల్లె గ్రామస్తులు వర్షం కురవాలని గంగమ్మతల్లికి వనభోజనాలు పెట్టారు. డప్పు, మంగళవాయిద్యాలతో మహిళలు గంపలో బోనాలు పెట్టుకుని వనభోజనం వెళ్లి అక్కడ గంగమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. వరికుంట గ్రామస్తులు బసిరెడ్డి కుంటకు, నాయునిపల్లె గ్రామస్తులు నరసింహస్వామికి, గొంటువారిపల్లె గ్రామస్తులు కుంట వద్ద గంగమ్మకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. వర్షం కురిపించాలని గ్రామస్తులందరూ మొక్కుకున్నారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

హెల్మెట్ ధారణ.. ప్రాణానికి రక్షణ



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ కేసీ రాజు

ప్రొద్దుటూరు క్రైం : హెల్మెట్ ధారణతో ప్రాణాలు రక్షించుకోవచ్చని రూరల్ ఎస్‌ఐ కేసీ రాజు తెలిపారు. శనివారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆటో నగర్‌లో రోడ్డు భద్రత, పలు రకాల నేరాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. వాహనదారులు ఇన్సూరెన్స్ చేయించాలని, అందువల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అతివేగంగా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలను నడపరాదని తెలిపారు. ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు. సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు, వాహనదారులు పాల్గొన్నారు.

ఆశీర్వాదం



వధూవరులతో ఎమ్మెల్యే డాక్టర్ సుధ

గోపవరం : బద్వేలు పట్టణంలోని బొజ్జిరెడ్డి కల్యాణ మండపంలో శనివారం రాత్రి మండలంలోని రాచాయపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆదూరి శివారెడ్డి బావమరిది పెంచల్‌రెడ్డి కుమార్తె మానస, విష్ణువర్ధన్ వివాహ వేడుకలకు ఎమ్మెల్యే డాక్టర్ సుధ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మల్లికార్జునరెడ్డి, హరికృష్ణారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, బద్వేలు మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, అట్లూరు మండల నాయకులు ప్రభాకర్‌రెడ్డి, బాలుమనిరెడ్డి, మాధవరెడ్డి తదితరులు ఉన్నారు.

నేవీ ఉద్యోగికి సీజీసీ మెడల్

కలసపాడు : మండలంలోని కొండపేట గ్రామానికి చెందిన పాలకొలను నారాయణరెడ్డి, వీరమ్మల కుమారుడు రమణారెడ్డి నేవీలో ఉద్యోగం చేస్తున్నారు. గత ఏడాది నవంబర్‌లో భారత నావీ సిబ్బంది సాహసోపేతంగా పాకిస్తాన్ సముద్ర జలాల్లో చిక్కుకున్న మన దేశ జాలర్లను రక్షించారు. రమణారెడ్డి సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఆయనకు సీజీసీ మెడల్‌ను బహూకరించారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

పోరుమామిళ్ల : ఉద్యోగ ఉపాధ్యాయులకు 5 డీఏలు, మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.వి.రమణారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఏపీటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధ్యంతర భృతి ప్రకటించకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం సరికాదని, 30 శాతం ఐఆర్ ఇవ్వాలని ఆయన కోరారు. 2022 నుంచి ఈఎల్ బకాయిలు ఇంత వరకు జమకాలేదన్నారు. అసిస్మెంట్ బుక్లెట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

కృష్ణం వందే జగద్గురుం



ప్రొద్దుటూరు కల్చరల్ : శ్రీకృష్ణబలరాములను దర్శించుకుంటున్న భక్తులు



ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణబలరాములు



ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణ పరిధి శివాలయం వీధిలోని శ్రీ కృష్ణాలయంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఉదయం నుంచి ఆలయంలో సందడి నెలకొంది. తెల్లవారుజామున వేణుగోపాలస్వామికి పంచామృతాభిషేకం, గో క్షీరాభిషేకంలను నిర్వహించి నూతన పట్టువస్త్రాలు, వెండి కవచాలు, రంగురంగుల పూలదండలు, గజమాలలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించి కాయా కర్పూరాలను నైవేద్యంగా సమర్పించి భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఉట్టికొట్టు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రం రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణుని ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, సుందరంగా రూపొందించిన రథంపై కొలువుదీర్చి డప్పు వాయిద్యాలు, చెక్కభజన, కోలాటం, బాణసంచా పేళుల్ల మధ్య వేడుకగా గ్రామోత్సవం నిర్వహించారు.

శ్రీకృష్ణున్ని దర్శించుకున్న ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్

స్థానిక శ్రీకృష్ణాలయంలోని శ్రీకృష్ణున్ని శనివారం ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రమేష్‌యాదవ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వేదపండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. ఆలయంలో శ్రీకృష్ణాలయ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన యాదవ సంఘం సమావేశంలో పాల్గొన్నారు. యాదవులు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ తెలిపారు. యాదవ వైద్యులు నాగార్జున, సత్యరంగయ్యలతోపాటు పలువురు వైద్యులకు మెమెంటో, తిరుమల ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో యాదవ సేవా సంఘం అధ్యక్షుడు దాసరి బాలసుబ్బరాయుడు యాదవ్, కార్యదర్శి రాచగొల్ల వెంకటరమణ యాదవ్, కోశాధికారి రామబోయిన వెంకటయ్య యాదవ్, మాజీ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్, యాదవ ప్రముఖులు పాల్గొన్నారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో..

స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం ఇస్కాన్ కేంద్రంలో శ్రీకృష్ణ బలరాముల విగ్రహాలకు విశేష పూజాకార్యక్రమాలను చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. హరినామ సంకీర్తన, భక్తిగీతాలాపనలు, భజనలు చేసి భక్తులకు పసాదం పంపిణీ చేశారు. సాయంత్రం మున్సిపల్ హైస్కూల్ మైదానంలో శ్రీకృష్ణబలరాముల ఉత్సవ మూర్తులకు విశేష పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం హరినామ సంకీర్తన, కృష్ణలీలా ప్రవచనం, 7 గంటలకు గౌరహారతి, భగవద్గీతా ప్రవచనాల కార్యక్రమం జరిగింది. శ్రీకృష్ణ బలరాములకు 108 రకాల వంటలతో నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కంస వధ నాటక ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. పాల్గొన్న భక్తులకు లందరికి స్వామి వారికి ప్రీతికరమైన వెన్నలడ్డూను ప్రసాదంగా అందించారు. రాత్రి దేవతా మూర్తుల విగ్రహాలకు మహాశంఖాభిషేకం, మహాపుష్పాభిషేకం, మహాహారతి, తీర్థప్రసాద వినియోగం చేశారు. స్వామివారిని ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ దర్శించుకున్నారు. ఆయనకు ఇస్కాన్ ప్రతినిధులు సత్కరించారు. స్వామి వారిని దర్శించు కునేందుకు వచ్చిన భక్తులతో మున్సిపల్ హైస్కూల్ మైదానం కిటకిట లాడింది. సాయంత్రం 4.30 నుంచి 11 కౌంటర్‌లను ఏర్పాటు చేసి 40 వేల మంది భక్తులకు అన్న ప్రసాద వినియోగం చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగ కుండా 400 మందిపైగా వలంటీర్లు, ఎన్‌సీసీ బృందం, భక్తులు, పోలీసులు సేవలందించారు. కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులు మధురేసుదాసు, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

కామనూరు గ్రామంలో..

ప్రొద్దుటూరు మండలంలోని కామనూరు శ్రీప్రసన్న వేణుగోపాల మాధవ గోసంరక్షణ శాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలకు కోలాటం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో శ్రీవాసవి కోలాటం బృందం వారు పాల్గొని ప్రథమ బహుమతిని గెలుపొందారు. వీరికి ప్రథమ బహుమతిగా రూ.12,500లను గోశాల అధ్యక్షుడు సోమా లక్ష్మీనరసయ్య, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు చీతిరాల నాగార్జున అందించారు. శ్రీవాసవి సిరిపురం ప్రొద్దుటూరు వారి ఆధ్వర్యంలో శిక్షణ తీసుకున్న మహిళలు కోలాటంతో ఆకట్టుకున్నారు. వీరు ప్రథమ బహుమతి గెలుపొందడంపై టీం లీడర్ రాజా వెంకట వరలక్ష్మిని, మాస్టర్ శ్రీధర్‌ను వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ అనుముల వేణుగోపాల్, సిరిపురం వాసవి క్లబ్ ట్రెజరర్ జయం సురేష్‌బాబు, ఈసీ మెంబర్లు రామారావు, సుబ్బారావు, స్వరూప్ అభినందించారు.

బద్వేలులో..

బద్వేలు అర్బన్ : కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పలు కృష్ణమందిరాలలో శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక నెల్లూరురోడ్డులోని శ్రీకృష్ణ మందిరం, గాండ్ల వీధిలోని గోపాలస్వామి ఆలయం, సిద్దవటం రోడ్డులోని అనంతగిరి క్షేత్రం శ్రీకృష్ణ మందిరాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెల్లూరు రోడ్డులోని శ్రీకృష్ణ మందిరంలో స్వామివారికి పంచామృతాభిషేకం, సహస్ర నామార్చనతో పాటు శాంతిహోమం నిర్వహించారు. స్థానిక తెలుగుగంగకాలనీ సమీపంలోని అనంతగిరి క్షేత్రంలోని శ్రీకృష్ణ మందిరంలో నిర్వహించిన రుక్మిణీ శ్రీకృష్ణుల కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త యానకిపెంచలయ్య, ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ

కృష్ణాష్టమి సందర్భంగా పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలల చిన్నారులు వేసిన చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలు అలరించాయి. స్థానిక ఆంజనేయనగర్‌లోని కార్తీక్ ప్లేస్కూల్‌లో చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు.

గురుకుల పాఠశాలలో..

మైదుకూరు : మైదుకూరు మండలం వనిపెంటలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మల ఆధ్వర్యంలో విద్యార్థినులు కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకున్నారు.



ప్రథమ బహుమతి అందుకుంటున్న శ్రీవాసవి కోలాట బృందం



డాక్టర్ నాగార్జునను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, యాదవ సేవా సంఘం ప్రతినిధులు



అన్నదాన కార్యక్రమంలో భక్తులు



ప్రొద్దుటూరు కల్చరల్ : భక్తులకు భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు



ప్రొద్దుటూరు కల్చరల్ : సంకీర్తనలు ఆలపిస్తున్న ఇస్కాన్ బృందం సభ్యులు



బద్వేలులో చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



కృష్ణుడు గోపికల వేషధారణలో ఉన్న విద్యార్థినులతో ప్రిన్సిపాల్ నిర్మల



కృష్ణాష్టమి వేడుకల్లో పాఠశాల విద్యార్థినులు

పెన్షన్ల తొలగింపు ప్రక్రియను వెంటనే ఆపాలి



మాట్లాడుతున్న దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు

బద్వేలు అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వికలాంగుల పెన్షన్లు తొలగించే ప్రక్రియను ప్రభుత్వం వెంటనే ఆపాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇండ్లఓబులేసు కోరారు. శనివారం స్థానిక రెడ్డెయ్యమఠం వీధిలోని దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రీవెరిఫికేషన్ పేరుతో లక్షల సంఖ్యలో వికలాంగ పెన్షన్లు తొలగించడం దారుణమన్నారు. 2010లో సదరం సర్టిఫికెట్ ద్వారా వైకల్య ధృవీకరణపత్రాలు పొందిన అర్హులకు సైతం రీవెరిఫికేషన్ పేరుతో పెన్షన్లు తొలగించడం సరికాదన్నారు. అంగవైకల్యంతో ఏ పని చేసుకోలేక పెన్షన్‌పైనే ఆధారపడి ఉన్న వికలాంగులకు ఉన్నపలంగా పెన్షన్ తొలగించడం అన్యాయమన్నారు. ప్రభుత్వం పునరాలోచించి రీవెరిఫికేషన్ పేరుతో పెన్షన్లు తొలగించే ప్రక్రియను తక్షణమే ఆపాలని కోరారు. సమావేశంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం ఏరియా అధ్యక్షుడు బాలరాజు, పట్టణ అధ్యక్షుడు రఫి, ఉపాధ్యక్షుడు మౌలాలి, గౌరవ సలహాదారుడు మురళి, సభ్యులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

మైదుకూరు : సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్.నాగసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మైదుకూరులో మహాసభల గోడ పత్రికలను సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఒంగోలు పట్టణంలో ఈనెల 22 నుంచి మూడు రోజులపాటు సీపీఐ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని పేర్కొన్నారు. ఈ మహాసభలకు మైదుకూరు నియోజకవర్గం నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు, కార్మికులు, కర్షకులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. 22వ తేదీ సాయంత్రం 4 గంటలకు వేలాది మందితో మహా ప్రదర్శన అనంతరం బహిరంగ సభ నిర్వహిస్తారని, 24, 25 తేదీలలో ప్రతినిధుల సభలు జరుగుతాయని వివరించారు. మహా సభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా, కార్మిక, రైతాంగ, ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.శ్రీరాములు, నియోజకవర్గ కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్, సహాయ కార్యదర్శి ఎస్.షావల్లి, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ఏవీ శివరాం తదితరులు పాల్గొన్నారు.

బాబు మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కాశినాయన : సీఎం చంద్రబాబు చంద్రబాబు నాయుడు హామీల అమలులో చేస్తున్న మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గుండం హనుమంతురెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గంగనపల్లె గ్రామంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా కరపత్రాలను వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేసి టీడీపీ ప్రభుత్వంలో ఎంత నష్టపోయారో వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు జి.రమణారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, సిద్ధారెడ్డి, రామచంద్రారెడ్డితోపాటు వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


శ్రావణమాస పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలో వెలసిన స్వయంభు శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం స్వామివారికి శ్రావణమాస పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని వెండి ఆభరణాలతో, పలురకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ ప్రధాన అర్చకులు పెంచలయ్యస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీన శ్రావణ అమావాస్య సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజాభిషేకాలు, శాకాంబరి అలంకారములో స్వామివారు దర్శనమిస్తారని, ఈ కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

అన్నదాన కార్యక్రమాలు



ఇత్తడి శంకు, చక్రం, తిరునామాలను ఈఓకు అందిస్తున్న దాతలు



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

రాజుపాళెం : శ్రావణ మాసంలో నాలుగో శనివారం కావడంతో వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు వెల్లాలలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే స్వాములకు అర్చకులు కుంకుమార్చన, అభిషేకాలు, ఆకుపూజ చేశారు. భక్తులు స్వాములను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే భక్తులకు నంద్యాలకు చెందిన బాబు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సంజీవరాయ అన్నదాన సత్రంలో భక్తులకు అన్నదానం చేశారు. దద్దనాల గ్రామ భజన బృందం ఆధ్వర్యంలో భజన పాటలు ఆలపించారు. శ్రీదేవీ భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు.

ఆలయాలకు దాతలు విరాళాలు

గోపల్లెకు చెందిన విశ్వనాథరెడ్డి రూ.లక్ష, నంద్యాలకు చెందిన సాంబమూర్తి రూ.లక్ష, కొమరోలుకు చెందిన దస్తగిరి రూ.50 వేలు, గోపల్లెకు చెందిన ఆదినారాయణరెడ్డి రూ.25 వేలు, రామకృష్ణారెడ్డి రూ.25 వేలు, పెద్దపసుపులకు చెందిన రికేష్‌రెడ్డి ఇత్తడి శంకు, చక్రం, తిరునామాలు విరాళంగా ఇచ్చారు. ఈ విరాళాలను ఈఓ వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణరెడ్డిలకు అందించారు.

ఘనంగా వేణుగోపాలస్వామి కల్యాణం



శ్రీదేవి భూదేవి సమేత వేణుగోపాలస్వామి కల్యాణం

పోరుమామిళ్ల : పట్టణంలోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. ఉదయం 6 గంటలకు శ్రీ వేణుగోపాలస్వామికి, మహాలక్ష్మికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, 7 గంటలకు అలంకరణ, లక్ష తులశీదళ అర్చన, 10 గంటలకు అమ్మవారికి కుంకుమార్చన పూజాకార్యక్రమాలు నిర్వహించారు. పదిన్నర నుంచి 12:30 గంటల వరకు వేదపండితులు కల్యాణం నిర్వహించారు. రొద్దం రమేష్, శ్రావణి దంపతులు కల్యాణానికి పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తులకు భోజన వసతి కల్పించారు. కృష్ణాష్టమి సందర్భంగా బాల బాలికలకు రాధాకృష్ణుల వేషధారణ పోటీలు, ఉట్టికొట్టే పోటీలు, భగవద్గీత శ్లోకాల పోటీ నిర్వహించగా, పోరుమామిళ్ల వాసవీక్లబ్, వనితాక్లబ్ సభ్యులు బహుమతులు అందజేశారు. సాయంత్రం 6 గంటలకు ఉత్సవమూర్తులకు గుడి ఉత్సవం నిర్వహించారు.

వైభవోపేతంగా కొండగోపాలస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

అట్లూరు : కొండగోపాలస్వామి కల్యాణ మహోత్సవం శనివారం వైభవోపేతంగా జరిగింది. మండల పరిధిలోని లంకమల్లేశ్వర అభయారణ్యంలో వెలసిన కొండగోపాలస్వామి ఆలయంలో శ్రావణమాస చివరి శనివారం సందర్భంగా వేదపండితుల మధ్య ఆలయ కమిటీ కల్యాణం నిర్వహించింది. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి, చిత్తూరు, అన్నమయ్య, అనంతపురం, నెల్లూరు జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు స్వామివారి ఆలయానికి చేరుకుని కల్యాణం తిలకించారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.